జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 11 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 5



# బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు



- కాంగ్రెస్ సహా పలు పార్టీల నుంచి 50 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక

**అశ్వారావుపేట, ఆగస్టు 10, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. అశ్వారావుపేట మండలం కొత్తకావడిగుండ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీలకు చెందిన 50 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరాయి. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో

మిగతా 2 లో...



4 లో..

# కమలానికి కేడర్ ఉన్నా..
# నాయకత్వమే బలహీనం!

● జిల్లాలో బలమైన ప్రత్యర్థులు.. బీజేపీలో సమన్వయం కరువు ● కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐని ఎదుర్కోవడంలో వెనుకబడుతున్న కమలం ● నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో లేని జిల్లా అధ్యక్షుడు? ● ఎన్నికల్లో నాయకత్వ ప్రభావం చూపలేకపోయారనే విమర్శలు ● కార్పొరేషన్ ఎన్నికల నిధులపై పార్టీ వర్గాల్లో ఆరోపణలు ● ప్రజా సమస్యలపై ఆశించిన స్థాయిలో కనిపించని ఉద్యమ కార్యాచరణ ● జిల్లా అధ్యక్షుడి పనితీరుపై అధిష్ఠానం సమీక్ష చేయాలనే డిమాండ్

# రైతు, కార్మికుల..
# కదనభేరి!



కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా జైల్‌భరో.. రాస్తారోకోలు

రైతు.. కార్మిక సమస్యలపై కదం తొక్కిన సంఘాలు

కొత్తగూడెం, ఇల్లందు, భద్రాచలంలో నిరసనలు.. క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆందోళనలు

- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి.. కార్మిక కోడ్‌లు వెనక్కి తీసుకోవాలి
- గిట్టుబాటు ధరకు చట్టబద్ధత.. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 10, ప్రజా జ్యోతి :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక విధానాలను నిరసిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా సోమవారం

మిగతా 2 లో...




3 లో...

# అంతా గంజాయి మాయమా..!

- తలాపునే గోదావరి.. మా గొంతుకు తడిలేదు" నినాదంతో ముందుకు సాగుతున్న సీపీఐ ప్రజా చైతన్య యాత్ర
- 140 గ్రామాల మీదుగా.. ప్రజా సమస్యలపై సీపీఐ ఉద్యమ బాట
- లక్ష్మీదేవిపల్లి రైతాంగానికి సీతారామ జలాలు అందించాలి
- అంబసత్రం, పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వాలి
- జీవో 76 అమలు చేసి పేదలకు ఇళ్ల స్థలాల హక్కులు కల్పించాలి
- సింగరేణి ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి
- "సీతారామ జలాలు రైతుల పొలాలకు చేరే వరకు పోరాటం" : ఎస్.కె. సాబీర్ పాషా



3 లో..

# తలాపునే గోదావరి..
# మా గొంతుకు తడిలేదు!

## బీఆర్ ఎస్ లోకి భారీగా చేరికలు

(మొదటి పేజీ తరువాయి...)

అశ్వారావుపేట నియోజకవర్గంలో సుమారు 25 వేల ఎకరాలకు పోడు పట్టాలు అందించడంతో పాటు రైతుబంధు కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించారని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రజలు తమ సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అప్పటివరకు పార్టీ శ్రేణులు, ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, కొత్తగా పార్టీలో చేరిన కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు

## అంబసత్రం రైతులను ఆదుకోవాలి



**లక్ష్మీదేవిపల్లి ఆగస్టు 10, ప్రజా జ్యోతి :** దశాబ్దాలుగా అంబసత్రం భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు హక్కు పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. సీపీఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఐదో రోజైన సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలంలో కొనసాగింది. సీతారాంపురం, లాలూతండా, కోరుకొండ, హేమచంద్రాపురం తదితర గ్రామాల్లో యాత్రకు ప్రజలు, రైతులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ 264 సర్వే నంబర్‌లోని సుమారు 5 వేల ఎకరాల అంబసత్రం భూములను గిరిజన, గిరిజనేతర పేదలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. రికార్డుల్లో అనుభవదారులుగా ఉన్నప్పటికీ హక్కు పత్రాలు లేవనే కారణంతో రైతు భరోసా నిలిపివేయడం, బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే సాగుదారులకు పట్టాలు ఇచ్చి రైతు భరోసా, పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని కోరారు. సీతారామ ఎత్తిపోతల పథకం నీటిని లక్ష్మీదేవిపల్లి మండల రైతాంగానికి అందించి సాగునీటి సమస్యను పరిష్కరించాలని అన్నారు. పోడు, అంబసత్రం సాగుదారులకు పట్టాలు ఇచ్చే వరకు సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడి రైతులు, కార్మికులు, సామాన్యుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు తదితరులు పాల్గొన్నారు..

## వైభవంగా శివాలయంలో నందీశ్వరునికి అభిషేకం



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 10,(ప్రజా జ్యోతి)** పాల్వంచ మండల పరిధి లోని కెపి జగన్నాపురం గ్రామంలో కొలువుతీరిన పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి త్రయోదశి సందర్భంగా ప్రత్యేకంగా పంచామృతాభిషేకం ,అష్టోత్తర శత నామార్చన పూజా కార్యక్రమాల అనంతరం మంత్రపుష్పం, నీరాజనం పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు , ఆలయ కార్య నిర్వహణ అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు ,ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు

# రైతు, కార్మికుల.. కదనభేరి!

(మొదటి పేజీ తరువాయి...)

రైతు, కార్మిక సంఘాలు, పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జైల్‌భరో, రాస్తారోకోలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతులు, కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటాన్ని కొనసాగించాలనే నినాదంతో నిర్వహించిన ఈ ఆందోళనల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను నిలిపివేయాలని, రైతులు, కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరారు.






**కొత్తగూడెం కేంద్రంగా ఇలా..**

కొత్తగూడెంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమం చేపట్టారు. సూపర్‌బజార్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి తీసుకెళ్లే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అడ్డుకట్ట వేయాలని, కార్మిక చట్టాల్లో మార్పులతో తీసుకొచ్చిన కార్మిక కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే రైతు, కార్మిక, వ్యవసాయ సంఘాలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

**ఇల్లందులో ఇలా..**

ఇల్లందు పట్టణంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జైల్‌భరో నిర్వహించారు. బుగ్గవాగు రహదారిపై బైఠాయించిన నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతులు, కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి ప్రజలకు అనుకూలమైన విధానాలను అమలు చేయాలని కోరారు.

**భద్రాచలంలో వాగ్వాదం దిశగా..**

భద్రాచలంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. గోదావరి వంతెన రహదారిపై నాయకులు, కార్యకర్తలు బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులకు, సీపీఎం నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని నాయకులు కోరారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.

**మండల కేంద్రాల్లోనూ నిరసనల హోరు**

జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాలకే ఆందోళనలు పరిమితం కాకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ రైతు, కార్మిక సంఘాలు, ఆయా రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. స్థానికంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, కార్మికుల వేతనాలు, హక్కుల పరిరక్షణ వంటి అంశాలను ప్రస్తావించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఒకేరోజు రైతు, కార్మిక సమస్యలపై నిరసనలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### రానున్న రోజుల్లో..

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో చేపట్టిన జైల్‌భరో, జిల్లా వ్యాప్తి నిరసనలతో రైతు, కార్మిక సంఘాలు తమ డిమాండ్లను మరోసారి బలంగా వినిపించాయి. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ రంగంపై కార్పొరేట్ ప్రభావానికి అడ్డుకట్ట, కార్మిక హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల పెంపు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, నిత్యావసర ధరల నియంత్రణ వంటి అంశాలు ప్రధానంగా తెరపైకి వచ్చాయి. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే రానున్న రోజుల్లో అన్ని సంఘాలను కలుపుకుని ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తామని నాయకులు ప్రకటించారు. దీంతో జిల్లాలో ఈరోజు ప్రారంభమైన నిరసనలు భవిష్యత్తులో ఏ రూపం దాల్చనున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.

## జీవో 76 అమలు చేయాల్సిందే

- **పేదల ఇళ్లకు పట్టాలు ఇచ్చే వరకు పోరాటం.. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**

**కొత్తగూడెం ఆగస్టు 10, ప్రజా జ్యోతి :** కుంటుపడిన కొత్తగూడెం ప్రాంత అభివృద్ధిని గాడిలో పెట్టింది సీపీఐనేనని, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేస్తున్న కృషికి ప్రభుత్వం సహకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఐదో రోజైన సోమవారం కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి కార్మిక ప్రాంతాల్లో ఆటా పాటలతో కొనసాగింది. రైల్వేస్టేషన్ సెంటర్, ఎంజీ రోడ్డు, సూర్యప్యాలెస్ రోడ్, సింగరేణి ప్రధాన కార్యాలయం, ఏసీబీ నగర్, రామవరం, 3 ఇంక్లైన్, 4 ఇంక్లైన్, రుద్రంపూర్, గౌతంపూర్, పెనగడప సెంటర్లలో నిర్వహించిన సభల్లో సాబీర్ పాషా మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన క్రమబద్ధీకరణ జీవో 76ను అమలు చేయకుండా బుట్టదాఖలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారి పరిస్థితి, పట్టాల జారీ ప్రక్రియపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా రామవరం, సింగరేణి ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు వెంటనే పొజెషన్ సర్టిఫికెట్లు జారీ చేసి యాజమాన్య హక్కులు కల్పించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఇళ్ల స్థలం, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందించాలని, నియోజకవర్గంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి సహకరించాలని కోరారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులతో కార్మిక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని, కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థ అభివృద్ధికి దశాబ్దాలుగా సేవలందించిన మాజీ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, సింగరేణిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల ఇళ్లను కూల్చివేసి నిర్వాసితులను



చేసే చర్యలను నిలిపివేయాలని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులకు వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగిస్తూ సామాన్యులపై భారాలు మోపుతున్న పాలకుల విధానాలను ప్రశ్నిస్తామని, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. చైతన్య యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సరరెడ్డి పుల్లారెడ్డి, మున్నాలక్ష్మీకుమారి, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, వాసిరెడ్డి మురళి, ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, జి.వీరస్వామి, ఎస్కే ఫహీం, ప్రజాసంఘాల నాయకులు భూక్యా శ్రీనివాస్, వరక అజిత్, ప్రజాప్రతినిధులు బోయిన విజయ్‌కుమార్, బండి నర్సింహా, దుర్గయ్య, సుధాకర్, మునిగడప పద్మ, శంకర్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ధనలక్ష్మి, యూసుఫ్, గట్టయ్య, ఖయూమ్, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అంతా గంజాయి మాయమా..!

బుగ్గవాగు బ్రిడ్జి సమీపంలో దర్జాగా గంజాయి విక్రయాలు..?

- పోలీసుల కళ్లుకప్పి సాగుతున్న దందా..!
- గంజాయికి బానిసలవుతున్న యువత..
- జీవితాలు అంధకారం
- నిర్మూలనకు తొలి అడుగు పడేనా..
- గంజాయి రహిత సమాజం సాధ్యమేనా?
- గంజాయి మహమ్మారికి కళ్లెం పడేనా?

**ఇల్లందు, ఆగస్టు 10 (ప్రజా జ్యోతి)**
ఇల్లందు పట్టణంలో గంజాయి మహమ్మారి క్రమంగా విస్తరిస్తుందనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా బుగ్గవాగు బ్రిడ్జి సమీప ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసుల నిఘా ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయించడం, సేవించడం జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో యువత గంజాయికి ఆకర్షితులై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారనే ఆవేదన వ్యక్తమవుతుంది.

**పోలీసుల కళ్లుకప్పి దందా..?**
గంజాయి విక్రయాలు, వినియోగంపై పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నప్పటికీ కొందరు అక్రమ వ్యాపారులు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని నిర్మానుష్య ప్రాంతాలు, బ్రిడ్జిలు, శివారు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారనే సమాచారం స్థానికుల్లో కలకలం రేపుతుంది. బుగ్గవాగు బ్రిడ్జి పరిసరాలపై ప్రత్యేక నిఘా పెట్టి వాస్తవాలను వెలికి తీయాలని ప్రజలు కోరుతున్నారు.

**సేవిస్తున్న యువత.. నాశనమవుతున్న భవిష్యత్తు**
గంజాయి మత్తుకు అలవాటు పడుతున్న యువత సంఖ్య పెరుగుతుండటంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సరదాగా ప్రారంభించిన వినియోగం క్రమంగా వ్యసనంగా మారి చదువు, ఉద్యోగం, కుటుంబ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. గంజాయికి బానిసైతే జీవితం అంధకారమే అనే విషయాన్ని యువత గుర్తించాలని సూచిస్తున్నారు.

**హద్దు మీరుతున్న యువత ప్రవర్తన..?**
మత్తు పదార్థాల ప్రభావంతో కొందరు యువతలో ప్రవర్తనా మార్పులు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్న వయసులోనే చెడు వ్యసనాలకు




బానిస కావడం భవిష్యత్తును దెబ్బతీస్తుందని, యువతను ఈ మహమ్మారి నుంచి కాపాడేందుకు కుటుంబం, పాఠశాలలు, సమాజం, పోలీసులు మరింత సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి**
యువత ఎవరితో స్నేహం చేస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు వచ్చాయా? అనే అంశాలపై తల్లిదండ్రులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పిల్లలను మందలించడం కంటే వారితో స్నేహపూర్వకంగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**బానిసలకు కౌన్సిలింగ్ అవసరం**
ఇప్పటికే గంజాయికి బానిసైన యువతను నేరస్తులుగా చూడటం కంటే వారికి అవసరమైన కౌన్సిలింగ్, డీ–అడిక్షన్ సహాయం, కుటుంబ మద్దతు అందించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వ్యసనం నుంచి బయటపడేలా సంబంధిత శాఖలు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతున్నారు.

**పోలీసుల నిఘా తప్పనిసరి**
బుగ్గవాగు బ్రిడ్జి పరిసరాలతో పాటు పట్టణంలోని అనుమానాస్పద ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. గంజాయి విక్రయదారులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వినియోగదారులకు కౌన్సిలింగ్ అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, యువత ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచిస్తున్నారు.

**గంజాయి నిర్మూలనకు మరో అడుగు పడేనా?**
గంజాయి అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయాలంటే కేవలం అప్పుడప్పుడు జరిగే దాడులు సరిపోవని, నిరంతర నిఘా, సరఫరా మార్గాల గుర్తింపు, విక్రేయేతలపై కఠిన చర్యలు, యువతకు అవగాహన అవసరమని ప్రజలు అంటున్నారు. బుగ్గవాగు బ్రిడ్జి పరిసరాల్లో వినిపిస్తున్న ఆరోపణలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించి నిజానిజాలను వెలికితీయాలని కోరుతున్నారు.

**గంజాయి రహిత సమాజం ఏర్పాటు సాధ్యమేనా..?**
గంజాయి రహిత సమాజం ఏర్పాటుకు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా స్పందించాల్సి ఉంటుంది. ఒక పోలీస్ శాఖకు కాకుండా సమాజంలో ప్రతి ఒక్క పౌరుడు గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, సేవించడం వంటివి వారి దృష్టికి వస్తే తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇస్తేనే సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గంజాయి మహమ్మారికి కళ్లెం పడేనా..?
యువత భవిష్యత్తును కాపాడేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే..

## గంజాయి నిర్మూలనకు ప్రత్యేక నిఘా: తాటిపాముల సురేష్, సీఐ, ఇల్లందు



గంజాయి నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇల్లందు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి రవాణా, విక్రయాలు, సేవించడంపై మరింత దృష్టి సారించడం జరిగింది. గంజాయి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలి. ముఖ్యంగా యువత తల్లిదండ్రులు వారి కదలికలపై దృష్టి సారించాలి. గంజాయికి బానిసైతే వారి జీవితం అంధకారం అవుతుంది. గంజాయి నిర్మూలనకు పోలీస్ శాఖతో పాటు బాధ్యత గల ప్రతి పౌరుడు సహకరిస్తేనే సాధ్యమవుతుంది.

# తలాపునే గోదావరి.. మా గొంతుకు తడిలేదు!

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 10, ప్రజా జ్యోతి :**
“తలాపునే గోదావరి.. మా గొంతుకు తడిలేదు”.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల సాగునీటి కష్టాలను ప్రతిబింబిస్తున్న ఈ నినాదంతో సీపీఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర బలమైన జన సమీకరణాతో ముందుకు సాగుతోంది. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 6న ప్రారంభమైన యాత్రకు గ్రామాల్లో ప్రజలు, రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే సుమారు 140 గ్రామాల మీదుగా సాగిన యాత్ర సోమవారం కొత్తగూడెం పట్టణానికి చేరుకుని జిల్లా ప్రజల సమస్యలను ప్రధానంగా ప్రస్తావించింది.

**సీతారామ జలాలు.. రైతులకు అందాలి**
గోదావరి ఒడ్డునే ఉన్న భద్రాద్రి జిల్లాలో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడటం దురదృష్టకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. ముఖ్యంగా లక్ష్మీదేవిపల్లి మండల రైతాంగానికి సీతారామ ఎత్తిపోతల పథకం జలాలను అందించి భూములను సస్యశ్యామలం చేయాలని డిమాండ్ చేశారు. సీతారామ జలాలు రైతుల పొలాలకు చేరితే వర్షాధార సాగుపై ఆధారపడుతున్న రైతులకు ఎంతో ప్రయోజనం





కలుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అప్పటి వరకు మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

**అంబసత్రం రైతులకు పట్టాలివ్వాలి**
లక్ష్మీదేవిపల్లి మండలంలోని 264 సర్వే నంబర్‌లో ఉన్న సుమారు ఐదు వేల ఎకరాల అంబసత్రం భూములను గిరిజన, గిరిజనేతర పేదలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారని సీపీఐ నాయకులు తెలిపారు. రికార్డుల్లో అనుభవదారులుగా ఉన్నప్పటికీ హక్కు పత్రాలు లేకపోవడంతో రైతు భరోసా అందక, బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకు పెట్టుబడులు లేక అప్పుల పాలవుతున్న పేద రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, అంబసత్రం, పోడు సాగుదారులకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని కోరారు.

**జీవో 76 అమలు చేయాలి**
కొత్తగూడెం పట్టణంలోని రామవరం, సింగరేణి ప్రాంతాల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలకు క్రమబద్ధీకరణ జీవో 76 ప్రకారం హక్కులు కల్పించాలని సీపీఐ డిమాండ్ చేసింది. పట్టాల జారీ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులకు పొజిషన్ సర్టిఫికెట్లు, యాజమాన్య హక్కులు కల్పించాలని కోరింది. కొత్తగూడెం నియోజకవర్గంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను మెరుగుపరచాలని, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేసి సహకరించాలని సీపీఐ నాయకులు కోరారు. దాంతో పాటు సింగరేణి ప్రాంతాల్లో సీఎస్ఆర్ నిధులతో సమగ్ర అభివృద్ధి చేపట్టాలని, కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి అభివృద్ధికి ఏళ్లుగా శ్రమించిన మాజీ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, సంస్థపై ఆధారపడిన కుటుంబాల నివాస సమస్యలను పరిష్కరించాలని కోరారు.



## ప్రజా, కార్మిక సమస్యలపై పోరాటం..

కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై సీపీఐ నాయకులు విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ సామాన్యులపై భారాలు మోపుతున్న విధానాలను వ్యతిరేకిస్తూ రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 6న ప్రారంభమైన ప్రజా చైతన్య యాత్ర గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రధానంగా సీతారామ జలాలు భద్రాద్రి రైతుల పొలాలకు చేరడం, అంబసత్రం, పోడు సాగుదారులకు పట్టాలు, పేదలకు ఇళ్ల స్థలాల హక్కులు, సింగరేణి ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. జిల్లా సమస్యలపై సీపీఐ చేపట్టిన ఈ ఉద్యమం పార్టీకి రాజకీయంగానూ కలిసి వచ్చే అంశంగా మారుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సాగునీరు, భూమి, ఇళ్లు, కార్మికుల హక్కులు వంటి ప్రజల జీవనానికి నేరుగా సంబంధించిన అంశాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలకు ప్రజల్లో మళ్లీ బలమైన స్థానం సంపాదించుకునే అవకాశం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.



# కమలానికి కేడర్ ఉన్నా..
# నాయకత్వమే బలహీనం!

- జిల్లాలో బలమైన ప్రత్యర్థులు.. బీజేపీలో సమన్వయం కరువు
- కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐని ఎదుర్కోవడంలో వెనుకబడుతున్న కమలం
- నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో లేని జిల్లా అధ్యక్షుడు?
- ఎన్నికల్లో నాయకత్వ ప్రభావం చూపలేకపోయారనే విమర్శలు
- కార్పొరేషన్ ఎన్నికల నిధులపై పార్టీ వర్గాల్లో ఆరోపణలు
- ప్రజా సమస్యలపై ఆశించిన స్థాయిలో కనిపించని ఉద్యమ కార్యాచరణ
- జిల్లా అధ్యక్షుడి పనితీరుపై అధిష్ఠానం సమీక్ష చేయాలనే డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 10, ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీజేపీకి బలం లేదా..? అంటే పూర్తిగా లేదని చెప్పలేని పరిస్థితి. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ ఆ పార్టీకి ఓటు బ్యాంకు ఉంది. పార్టీ సిద్ధాంతాలను నమ్మే నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీకి అనుకూలంగా నిలిచే వర్గాలు కూడా ఉన్నాయి. అయితే ఈ బలాన్ని రాజకీయ శక్తిగా మలచడంలో జిల్లా నాయకత్వం విఫలమవుతోందనే విమర్శలు సొంత పార్టీ వర్గాల నుంచే వినిపిస్తున్నాయి.

### ♦ సమన్వయం లేని నాయకత్వం..

జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ వంటి పార్టీలకు బలమైన రాజకీయ పునాదులు ఉన్నాయి. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు ఆయా పార్టీలకు కేడర్, నాయకత్వం, ఓటు బ్యాంకు ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ కూడా ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాల్సి ఉంది. అయితే పార్టీ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో జిల్లా నాయకత్వం విఫలమవుతోందనే విమర్శలు ఉన్నాయి. ముఖ్య నాయకులకే జిల్లా అధ్యక్షుడు అందుబాటులో ఉండడం లేదనే అసంతృప్తి ఉంటే.. సాధారణ కార్యకర్తల పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ పార్టీలో జరుగుతోంది. కేడర్‌కు అండగా నిలవడం, గ్రామస్థాయిలో పార్టీని విస్తరించడం, నాయకులను కలుపుకొని వెళ్లడంలో మరింత చురుకుదనం అవసరమని పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నారు.

### ♦ ఎన్నికల్లోనూ కనిపించని ప్రభావం?

జిల్లా అధ్యక్షుడిగా బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన ఎన్నికల్లో తన నాయకత్వ ప్రభావాన్ని ఆశించిన స్థాయిలో చూపించలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. పార్టీ ఓటు బ్యాంకును పెంచడం, కొత్త ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయడం, ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలను ఆకర్షించడంలో చెప్పుకోదగ్గ పురోగతి కనిపించలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇక ప్రస్తుత జిల్లా అధ్యక్షుడికి రెండోసారి అవకాశం దక్కడంపైనా కూడా పార్టీలో చర్చ జరుగుతోంది. రెండోసారి అవకాశం పొందిన నాయకత్వం పార్టీని అసలు ఏ స్థాయిలో బలోపేతం చేసిందనీ, నానాటికి ఇంకా క్యాడర్ తగ్గుతోందనే ప్రశ్న సొంత పార్టీలోనే వినిపిస్తోంది.

### ♦ కార్పొరేషన్ ఎన్నికల నిధులపై ఆరోపణలు..

కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల సమయంలో సుమారు 55 డివిజన్లలో బీజేపీ అభ్యర్థులు పోటీ చేశారు. ఎన్నికల ఖర్చుల కోసం పార్టీ అధిష్ఠానం నుంచి అభ్యర్థులకు నిధులు పంపించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఆ నిధులు అభ్యర్థులకు పూర్తిస్థాయిలో చేరలేదని కొందరు అభ్యర్థులు, నాయకులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల నిధుల పంపిణీ, వినియోగంపై స్పష్టమైన లెక్కలు వెల్లడించాలని కొందరు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో జిల్లా అధ్యక్షుడి పాత్రపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పార్టీ అధిష్ఠానం విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని పార్టీ వర్గాల్లో డిమాండ్ వినిపిస్తోంది.

## ప్రజా సమస్యలపై పోరాటం కరువు..

జిల్లాలో రైతులు, గిరిజనులు, నిరుద్యోగులు, సింగరేణి కార్మికులు, భూసమస్యలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు వంటి అనేక అంశాలు ప్రజల్లో చర్చనీయాంశంగా ఉన్నాయి. వీటిని రాజకీయంగా మలుచుకునే అవకాశం బీజేపీకి ఉన్నప్పటికీ.. పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు నిర్వహించడంలో పార్టీ వెనుకబడుతోందనే విమర్శలు ఉన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ వంటి బలమైన ప్రత్యర్థులను ఎదుర్కొని బీజేపీ ఎదగాలంటే ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా ప్రజల్లో ఉండాల్సిన అవసరం ఉంది. ప్రతి మండలంలో కార్యక్రమాలు, ప్రతి నియోజకవర్గంలో స్పష్టమైన కార్యాచరణ, ప్రతి గ్రామంలో కార్యకర్తలతో నిరంతర సంబంధాలు అవసరం. జిల్లాలో బీజేపీ బలహీనతకు ఓటు బ్యాంకు లేకపోవడమే కారణం కాదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉన్న బలాన్ని సమన్వయం చేయడం, కార్యకర్తలకు అండగా నిలవడం, నాయకులను ఒకే వేదికపైకి తీసుకురావడంలో లోపాలే ప్రధాన కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్షుడి పనితీరుపై పార్టీ అధిష్ఠానం సమీక్ష నిర్వహించాలని, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచేలా చర్యలు తీసుకోవాలని పార్టీ వర్గాలు కోరుతున్నాయి. అవసరమైతే జిల్లా అధ్యక్షుడిని మార్చాలనే డిమాండ్ కూడా పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.

# ఆర్టీసీ బంకులో డిపో మేనేజర్ తనిఖీలు

**చర్ల, ఆగస్టు 10:(ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలోని టీఎస్ఆర్టీసీ ఫ్యూయల్ అవుట్‌లెట్‌ను సోమవారం డిపో మేనేజర్ జంగయ్య తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ నాణ్యత, డెన్సిటీ, వాటర్ లెవల్, మీటర్ రీడింగ్, డిస్పెన్సింగ్ నాజిల్స్ ద్వారా సరఫరా అవుతున్న పరిమాణాన్ని పరిశీలించారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఫ్యూయల్ అవుట్‌లెట్‌లో కల్తీ, డీజిల్‌లో నీరు కలిసిందంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. తనిఖీల్లో పెట్రోల్, డీజిల్ నాణ్యత, డెన్సిటీ, వాటర్ లెవల్ నిర్దేశిత ప్రమాణాల పరిధిలోనే ఉన్నట్లు వెల్లడించారు. ఇంధనంలో ఎలాంటి కల్తీ లేదని స్పష్టం చేశారు.ఇటీవల ఒక సీసాలో డీజిల్ నాణ్యతపై అనుమానం వ్యక్తమైన ఘటనలో సీసా శుభ్రంగా లేకపోవడం వల్లే అలా జరిగి ఉండవచ్చని తెలిపారు. అదే సమయంలో ఇతర సీసాల్లో ఇంధనాన్ని పరీక్షించిన ప్పుడు ఎలాంటి సమస్య కనిపించలేదన్నారు. ఆర్టీసీ సంస్థ నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తుందని ప్రయాణికులకు ప్రమాణాలతో కూడిన పెట్రోల్, డీజిల్ అందించేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఇంధన నాణ్యతపై ప్రయాణికులకు ఎలాంటి అనుమానాలు లేదా సమస్యలు ఉన్నా నేరుగా డిపో మేనేజర్‌ను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. నిర్ధారణ లేకుండా ఇంధన నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేయకుండా వాస్తవాలను పరిశీలించిన అనంతరం స్పందించాలని కోరారు.అనంతరం చర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూడా డిపో మేనేజర్ పరిశీలించారు. ప్లాంట్ పనితీరును తనిఖీ చేసి అక్కడి నీటిని తాను స్వయంగా తాగి ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ను ప్లాంట్ ను వినియోగించుకోవాలని సూచించారు. బస్టాండ్‌లో నిలిచిన ఆర్టీసీ బస్సులను తనిఖీ చేసి ప్రయాణికులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భద్రాచలం నుంచి రాత్రి 9 గంటలకు చర్లకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరగా సమస్యను పరిశీలించి బస్సు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ తెలిపారు.కొన్ని బస్సులు నిర్ణీత ప్రాంతాల్లో ఆపడం లేదని ప్రయాణికులు ఫిర్యాదు చేయగా అలాంటి ఘటనలు తమ దృష్టికి వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ లక్ష్యమని తెలిపారు.










# కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా జైల్‌భరో

**చర్ల, ఆగస్టు 10:(ప్రజా జ్యోతి ):** కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా స్ఫూర్తితో సోమవారం చర్ల అంబేద్కర్ సెంటర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేపట్టి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఆన్‌లైన్ ఎరువుల విధానాన్ని రద్దు చేసి గతంలో మాదిరిగానే రైతులకు ఎరువులు అందించాలని, వీబీ-జీ రామ్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే 100 రోజుల ఉపాధి హామీ పనిని కొనసాగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి గ్రామీణ పేదలకు 100 రోజుల పని కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా కార్మికుల కేంద్ర సంఘం (సీఐటీయూ) అధ్యక్షురాలు పాయం రాధా కుమారి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందెల చంటి, రైతు సంఘం ఉపాధ్యక్షుడు మచ్చా రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. రైతులకు ఎరువులు సకాలంలో అందించాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి 100 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు రహదారి నిర్మించాలని, పెట్రోలు, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. తాలిపేరు ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువలకు మరమ్మతులు చేపట్టి రైతులందరికీ సకాలంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం జైల్‌భరో కార్యక్రమం చేపట్టగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికుల కేంద్ర సంఘం కార్యదర్శి విజయశిల, రైతు సంఘం నాయకులు నల్లగట్ల మూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నాగవర్మ, ఆటో కార్మికుల సంఘం అధ్యక్షుడు పామర్రు బాలాజీ, ఉపాధ్యక్షుడు బాలరాజుల సత్తిరాజు, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల కార్యదర్శి పొదుపుగంటి సమ్మక్క, గిరిజన సంఘం మండల కార్యదర్శి వరదల వరలక్ష్మి, వ్యవసాయ మహిళా విభాగం అధ్యక్షురాలు ఉడుగుల షారోన్, రైతు సంఘం నాయకుడు నవీన్, యువజన విభాగం అధ్యక్షుడు తులసి, కంచర్ల సతీష్, కోశాధికారి కుక్కడపురాంబాబు పాల్గొన్నారు.






